సాక్షి
చిత్తూరు
గురువారం । 12 । అక్టోబర్ । 2023



ఇళ్ల స్థలాలకు భూసేకరణ

ఇళ్లు లేని నిరుపేదలకు యుద్ధప్రాతిపదికన స్థలాలు ఎంపిక చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



అది పాము కళేబరం కాదు..

పౌష్టికాహారం పంపిణీలో వచ్చింది పాము కళేబరం కాదని, ప్లాస్టిక్ అని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	22
తిరుపతి	35	23
తిరుమల	31	18
గూడూరు	36	24
నగరి	35	23

న్యూస్‌రీల్

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె సచివాలయ పరిధిలోని తొడతరలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారులు ప్రియాంక, దాత్రేయచౌదరి, మోహన్ వేలు, వినయ్‌కుమార్, స్పెషలిస్ట్ డాక్టర్లు గాయిత్రి, సాయిరామ్ 412 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులనుఆదేశించారు. దృష్టి లోపం ఉన్న వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, సర్పంచులు రాధిక, సుధాకర్ ప్రారంభించారు.

బడిఈడు పిల్లలు బడికెళ్లేలా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : బడిఈడు పిల్లలు బడికెళ్లేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డ్రాపౌట్లు లేకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నివాసం ఉంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు సేకరించాలని చెప్పారు. ప్రతి తరగతిలో విద్యార్థుల సంఖ్యను సరిపోల్చాలన్నారు. విద్యార్థుల సంఖ్య వివరాలు పక్కాగా ఉండాలని తెలిపారు. పదవ తరగతి వరకు 817 మంది, పదవ తరగతి తర్వాత 6 వేల మంది విద్యార్థులు సరిహద్దు రాష్ట్రాల్లో విద్యనభ్యసిస్తున్నారని విద్యాశాఖ అధికారులు వివరించారు. ఆర్‌ఐవో ప్రభాకర్ రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవీఈవో దయానందరాజు తదితరులుపాల్గొన్నారు.

బోయకొండ ఆలయ చైర్మన్‌గా నాగరాజారెడ్డి



నాగరాజారెడ్డి

పుంగనూరు: జిల్లాలో పేరొందిన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఏఎంసీ మాజీ చైర్మన్ వి.నాగరాజారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కమిటీ సభ్యులుగా పి.రజిని, కె.రామదాసు, జి.భారతి, ఎ.రాజేష్, ఎం.బుద్ధమ్మ, ఎస్.పవన్ కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, సి.లక్ష్మీదేవి, డి.రెడ్డెమ్మ, ఎక్స్‌ఆఫిషియో సభ్యుడిగా అర్చకుడు గంగిరెడ్డిని నియమించారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. తనను నియమించిన మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి కుటుంబానికి నూతన చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్లీనమే



మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్‌బాబు

చిత్తూరు అర్బన్: పోలీసు విభాగంలో హోంగార్డులు కూడా ఓ భాగమేనని, వీరి సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని కర్నూల్ రేంజ్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరుకు వచ్చిన ఆయన ఇక్కడి హోంగార్డు యూనిట్‌ను పరిశీలించారు. హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. కమాండెంట్ మాట్లాడుతూ జిల్లాలో 661 మంది శాంతి భద్రతల కోసం, 227 మంది డెప్యుటేషన్లపై ఇతర శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అన్ని వేళల్లో పోలీసులతో సమానంగా హోంగార్డులు కూడా శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. హోంగార్డుల బీమా కోసం ఆక్సిస్ బ్యాంకుతో కుదుర్చున్న ఒప్పందం, తద్వారా అమలయ్యే పథకాలను వివరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలను అందచేశారు.ఆర్‌ఐ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకు ఆలంబన

మహిళలకు మాతృత్వం వరం. గర్భిణి అని నిర్ధారణ అవగానే ఆ యువతి కళ్లలో ఆనందం తొంగి చూస్తుంది. నెలలు నిండే కొద్దీ ఆ ఆనందం స్థానంలో క్రమంగా ఆందోళన చోటు చేసుకుంటుంది. తనకు సుఖ ప్రసవం అవుతుందా..?, సిజేరియన్ చేయాల్సి వస్తుందా..? అన్న ఆవేదనకు గురవుతుంది. ఇకపై ఆ చింత తొలగనుంది. షీ సేఫ్ విధానంతో కత్తెర కాన్పులకు చెక్ పడనుంది. ప్రైవేటు ఆస్పత్రులపైనా నిఘా పెరగనుంది. సుఖప్రసవానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తూ అమ్మకు ఆలంబన చేకూర్చనుంది రాష్ట్రప్రభుత్వం.

- కత్తెర కాన్పులు ఇక కట్
- షీ సేఫ్ విధానంతో సహజ ప్రసవాలకు ప్రాధాన్యం
- గర్భిణులకు అవగాహన కల్పించే దిశగా అడుగులు
- ప్రైవేటు ఆస్పత్రుల సిజేరియన్లపై నిఘా



ప్రసవంపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది



ప్రభుత్వాస్పత్రుల్లో..

నెల	సహజ ప్రసవం	ఆపరేషన్	మొత్తం
మే	535	235	770
జూన్	522	214	736
జూలై	564	212	776
ఆగస్టు	552	258	810

ప్రైవేటు ఆస్పత్రుల్లో..

నెల	సహజ ప్రసవం	ఆపరేషన్	మొత్తం
మే	444	280	724
జూన్	396	311	707
జూలై	420	312	732
ఆగస్టు	406	284	690

సాధారణ కాన్పు.. సిజేరియన్‌కు తేడాలివీ..

- సాధారణ కాన్పు జరిగిన మహిళలు ఆరోగ్యంగా ఉంటారు.
- కాన్పు జరిగిన రెండో రోజు నుంచే పనులు చేసుకుంటారు.
- పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది.
- శస్త్ర చికిత్స ద్వారా బిడ్డకు జన్మనిస్తే మహిళ శారీరక పరిస్థితి ఆధారంగా రెండు వారాల వరకు విశ్రాంతి అవసరం.
- ప్రసవ సమయంలో 9 మాసాలు పూర్తయినా కొందరు మహిళలకు నొప్పులు రావు. ఇలాంటి సందర్భంలోనూ శస్త్రచికిత్స చేస్తుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న వైద్యులు సిజేరియన్ ఆపరేషన్లను ప్రోత్సహిస్తున్నారు.

చిత్తూరు రూరల్: అమ్మ కడుపుకోతకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. షీ సేఫ్ పేరుతో సహజ ప్రసవాలకు రూపకల్పన చేసింది. గర్భిణులకు అవగాహన కల్పించి సిజేరియన్లు కట్టడి చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పూర్తి అయ్యింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న సిజేరియన్లపై నిఘా పెట్టేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాలో ఒక జిల్లా ప్రభుత్వాస్పత్రి, 4 ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు వైద్య సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలు చేస్తున్నారు. గత నెల నుంచి పీహెచ్‌సీలు కూడా 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గించాలని, సహజ ప్రసవాల సంఖ్య పెంచడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో సహజ ప్రసవాలు 70 నుంచి 80 శాతం నమోదవుతున్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రసూతి సేవలు అందించే ప్రైవేటు ఆస్పత్రులు సుమారు 500 పైగా ఉన్నాయి. వీటిలో 60 నుంచి 70 శాతం శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల ప్రకారం శస్త్రచికిత్సలు 10–15 శాతం లోపే ఉండాలి. అవసరం లేకపోయినా డబ్బులు దండుకునేందుకు సిజేరియన్లు చేస్తుండడంతో మహిళలకు ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని అరికట్టాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం.

ఆపరేషన్ల కుదింపుపై ప్రత్యేక దృష్టి

జిల్లావ్యాప్తంగా మే నుంచి ఆగస్టు వరకు అధికారిక గణాంకాలు పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 5,945 ప్రసవాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాస్పత్రుల్లో మొత్తం 3,092 ప్రసవాలు జరగ్గా, 2,173 సుఖ ప్రసవాలు, 919 మాత్రమే సిజేరియన్ ఆపరేషన్‌లు చేశారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో 2,853 జరగ్గా.. 1,187 శస్త్ర చికిత్సలు, సాధారణ ప్రసవాలు 1,666 జరిగాయని అధికారులు వెల్లడిస్తున్నారు. సిజేరియన్ల సంఖ్యను మరింత కుదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

షీ–సేఫ్‌తో...

బిడ్డకు జన్మనివ్వడం పునర్జన్మతో సమానం. అది సహజపద్ధతిలో జరిగితే తల్లీబిడ్డ అత్యంత సురక్షితం. పుట్టే బిడ్డకూ ఎలాంటి ఆపద ఉండదు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాల ధనదాహంతో అమ్మ కడుపును కోసేస్తున్నాయి. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా.. దోపిడీయే పరమావధిగా సిజేరియన్ ఆపరేషన్లు చేసేస్తున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేస్తే తప్పు కాదు, కానీ ఇది సాకుగా చూపి పైసలే పరమావధిగా ప్రైవేటు వైద్యులు శస్త్ర చికిత్సలను ప్రోత్సహిసున్నారు. సిజేరియన్‌కు రూ.50 వేల నుంచి రూ.80 వరకు వసూలు చేస్తున్నారు. జిప్ పద్ధతి (కోత కనబడని శస్త్రచికిత్స) పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు. కాన్పుల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారిలో 80 శాతం మందికి శస్త్రచికిత్సలు చేస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ఇలాంటి దయనీయ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు వైద్యశాఖ సన్నద్ధం అవుతోంది. అవసరం లేని సిజేరియన్లతో కలిగే అనర్థాలు, సహజ ప్రసవాలతో జరిగే మేలును గర్భిణులకు వివరించేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. సహజ ప్రసవాలు ప్రోత్సాహించేందుకు షీ–సేఫ్ విధానాన్ని రూపకల్పన చేసి, అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

షీ సేఫ్ అంటే..

అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలన్నదే షీ–సేఫ్ ఉద్దేశం. దీనిపై వైద్యులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తారు. సిజేరియన్ విధానాలతో మాత శిశుమరణాలు జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఆపరేషన్ చేసే సమయంలో అత్యంత సురక్షిత పద్ధతులు పాటించాలని సూచిస్తారు. ఈ విధానానికి యునిసెఫ్ సైతం సహకారం అందిస్తోంది.

అత్యవసర పరిస్థితుల్లోనే సిజేరియన్



ప్రభుత్వాస్పత్రుల్లో వీలైనంత వరకు సుఖ ప్రసవం అయ్యేలా చూస్తున్నాం. ఆస్పత్రికి వచ్చే 50 శాతం కేసులు బీపీ, రక్తహీనత లోపంతో వచ్చేవారే. అలాంటి వారికి కూడా ఆస్పత్రుల్లో సుఖ ప్రసవం జరిగేలా చూస్తున్నాం. కానీ పక్షంలో సిజేరియన్ చేస్తున్నాం. దీంతో పాటు క్షేత్రస్థాయిలో సిజేరియన్‌తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి.

– ఉషశ్రీ, గైన కాలజిస్ట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

వైద్యుల సలహాలు తీసుకోవాలి



గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి. అలాగే మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. రక్తహీనత లోపమే మాతా శిశుమరణాలు, ఆపరేషన్లకు కారణమవుతుంది. అనవసర సిజేరియన్లు నియంత్రించడంపై దృష్టి సారిస్తున్నాం. ఇందుకోసం గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ క్రమంలో సీ–సేఫ్ ప్రణాళిక రచించాం. ప్రైవేటు ఆస్పత్రుల్లోనే సిజేరియన్లు నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

ఆరోగ్య అభయం..!



బంగారుపాళ్యెం: బుధవారం టేకుమందలో వైద్య పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా హెల్త్ క్యాంపులు
- శిబిరానికి జన తాకిడి
- 28 క్యాంపుల్లో 9,274 ఓపీలు

చిత్తూరు రూరల్: పేదలకు అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. వ్యాధి ఏదైనా నయం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు వైద్య బృందాలు పరుగులు తీస్తున్నాయి. ఏఎన్‌ఎం, వలంటీర్లతో పాటు వైద్య సిబ్బంది ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తుండగా, శిబిరాల ద్వారా అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్ద వ్యాధులు, ఆపరేషన్లకు సంబంధించిన బాధితులను నేరుగా జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన శిబిరాలకు జన తాకిడి అధికమైంది. క్యాంపులో చికిత్స కోసం క్యూకట్టారు. 28 వైద్య శిబిరాలు నిర్వహించగా 9,274 ఓపీలు వచ్చాయి. ఇందులో జనరల్ ఓపీలు 3529, ఒబీజీ 677, పీడియాట్రిక్స్ 507, ఆర్థో1408, డెంటల్ 169, చర్మ సంబంధిత సమస్యలు 303, ఆప్తమాలజీ 1750, ఇతర ఓపీలు 930 వరకు వచ్చాయి. 56 మంది పీహెచ్‌సీ వైద్యాధికారులు, 58 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది శిబిరాలను విజయవంతం నిర్వహించారు. కంటి వెలుగు కింద 750 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

నేడు కాయం లేఅవుట్‌లో గృహ ప్రవేశాలు

- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం జగన్



ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం కాయం గ్రామంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో గురువారం సామూహిక గృహ ప్రవేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కాయం లేఅవుట్‌లోని గృహ నిర్మాణాలను జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కాయం లేఅవుట్‌లో 780 ఇళ్లు ఉన్నాయన్నారు. అన్ని ఇళ్లకు మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు



ఓజీకుప్పంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : అన్నదాతకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయని పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తు నుంచి విక్రయం దాకా ఒకేచోట అందించాలన్నదే లక్ష్యంతోనే ఆర్‌బీకే వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. అన్నదాతలకు ఆర్‌బీకేలు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులకు పలు మార్పులు ఆర్‌బీకేలతో కనిపిస్తున్నాయన్నారు. సమాచారంతో పాటు అన్ని వ్యవసాయ పనులకు ఆర్‌బీకేలు కేంద్ర బిందువుగా మారాయని తెలిపారు. రైతుకు కావలసిన సేవలన్నీ ఇంటి ముంగిటే చేరువయ్యాయన్నారు. గతంలోలా విత్తనాల కోసం పడిగాపులు, ఎరువుల కోసం ఆందోళనలు ఇప్పుడు లేవన్నారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లి, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఎంపీడీవో లీలామాధవి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్‌లు మోహన్, రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విరులు.. సిరులు

ఇన్నాళ్లు ఆహారపంటలు, వాణిజ్య, కూరగాయ పంటలను సాగు చేస్తున్న జిల్లాలోని పడమటి మండలాల రైతులు పూలసాగుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో గ్యారెంటీ లాభాలు వస్తుండడంతో వివిధ రకాల పూల సాగు చేస్తున్నారు. దీనికితోడు ఈ ప్రాంతం అటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రాజధానులకు మధ్యలో ఉండడంతో మార్కెటింగ్ సౌకర్యం అనుకూలంగా ఉంది. ఈ ఏడాది పూల సాగు విస్తీర్ణం పెరిగింది.

- కొత్త వెరైటీ బంతి, చామంతి సాగుపై రైతుల ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో ఆదాయం
- మార్కెటింగ్ సౌకర్యంతో సులువుగా రవాణా
- సాధారణాన్ని మించి ఈ పర్యాయం పూలతోటల సాగు





వీ.కోట మండలంలో సాగవుతున్న రెడ్, ఎల్లో బంతి పూల తోటలు



పలమనేరు: రైతులు సంప్రదాయ వ్యవసాయానికి దూరమై పూలసాగుతో ఆదాయం గడిస్తున్నారు. పలమనేరు హార్టీకల్చర్ డివిజన్‌లోని వీ.కోట, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, బైరెడ్డిపల్లె, పుంగనూరు హార్టీకల్చర్ డివిజన్‌లోని గంగవరం, పెద్ద పంజాణి, సోమల, సదుం, చౌడేపల్లె రామసముద్రం మండలాల్లో ఏటా పూలను సాగు చేస్తుంటారు. ఏటా సాధారణ పూలసాగు 680 ఎకరాలుగా ఉండగా, ఈ పర్యాయం 1600 ఎకరాలకు సాగు పెరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బంతిలో ఆరెంజ్, ఎల్లో, చామంతిలో పేపర్ ఎల్లో, పేపర్‌వైట్, వైలెట్, చాక్లెట్ చామంతి రకాలను ఎక్కువగా సాగు చేశారు. మరికొందరు రైతులు పలు కాల రంగుల రోజాపూలను సాగు చేస్తున్నారు. ఇవన్నీ కొత్తగా ఉత్పత్తి చేసిన హైబ్రిడ్ రకాలు కావడంతో పంట ఏపుగా పెరిగి దిగుడి అధికంగానే ఇస్తున్నాయి.

సీజన్‌తో సంబంధం లేకుండా..

ఇక్కడ అనుకూలిస్తున్న శీతల వాతావరణం వల్ల బంతిని ఎప్పుడైనా నాటుకోవచ్చు. స్థానిక నర్సరీల్లో అన్నిరకాల పూలమొక్కల నారు లభిస్తోంది. మొక్కలు నాటాక 40 రోజుల నుంచి పూల కోతలు మొదలై మూడునెలలదాకా దిగుబడులుంటాయి. ఇక చామంతికి సంబంధించి జూన్, జూలైలో నాటిన తోటల్లో పూల కోతలు మొదలయ్యాయి. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ రాత్రి కాలం ఎక్కువగా ఉంటుంది. దీంతో పూల దిగుబడి ఎక్కువగా రావడం పరిపాటి. కొందరు రైతులు బంతి, చామంతిని పాలిహౌస్‌లలో పెంచుతున్నారు. మొక్క పెరిగేదాకా ఎల్‌ఈడీ లైట్లను పెట్టి 45 రోజుల తర్వాత బ్లాక్‌షీట్‌లను కప్పి అధిక దిగుబడులను సాధిస్తున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం

ఈ ప్రాంతం నుంచి కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడులోని చెన్నై, మనరాష్ట్రంలోని విజయవాడ, తెలంగాణలోని హైదరాబాద్‌కు ఎక్కువగా పూలను ఎగుమతి చేస్తున్నారు. దీనికితోడు ఇతర రాష్ట్రాల వ్యాపారులు పెద్ద ఎత్తున ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కుప్పం, శాంతిపురం, వీ.కోట, పలమనేరు, పుంగనూరులో పూల మార్కెట్లున్నాయి.

పూలసాగే మేలు



నేను ప్రతి సంవత్సరం బంతి, చామంతితో పాటు రోజా పూలను సాగుచేస్తున్నా. మూడు రకాల పూలను సాగు చేయడంతో ధరలు ఒకదానికి లేకున్నా ఇంకో దానికి ఉంటుంది. వేరే వాణిజ్య పంట చేయాలన్నా పెట్టుబడి ఎక్కువ. అంత పెట్టినా లాభం ఉంటుందో..లేదో తెలియదు. అందుకే రెండేళ్లుగా పూలసాగు చేస్తున్నా. నష్టం లేకుండా ఆదాయం వస్తోంది.

– శివ, పూల రైతు, చీలంపల్లె, బైరెడ్డిపల్లె మండలం

రైతులకెంతో లాభదాయకం



జిల్లాలోనే పూల సాగులో పలమనేరు, కుప్పం డివిజన్లు ముందున్నాయి. పూలతోటల సాగుకు ఇక్కడి నేల, వాతావరణం బాగుంటుంది. పెద్దగా నష్టం రాకుండా ఉండడం వల్ల రైతులు పూలసాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. పెద్దగా చీడపీడల బాధ లేకుండా తక్కువ పెట్టుబడితో రైతులు ఆదాయం పొందుతున్నారు. పండుగ సీజన్ వస్తే మంచి ధరలు పలుకుతున్నాయి.

–డాక్టర్ కోటీశ్వరావు, హార్టీకల్చర్ ఏడీ, పలమనేరు

క్లుప్తంగా

రేపు కొత్త ఆర్డీఓ కార్యాలయం ప్రారంభం


మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలో అధునాతన హంగులతో నిర్మించిన నూతన ఆర్డీవో కార్యాలయాన్ని ఈనెల 13న ప్రారంభించనున్నట్లు ఆర్డీవో రేణుక వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్యేలు ధర్మాన ప్రసాదరావు, విశిష్ట అతిథులుగా ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మేయర్ అముద విచ్చేస్తారన్నారు. సభకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షత వహిస్తారని ఆర్డీవో వివరించారు.

మంత్రి పెద్దిరెడ్డితోనే చిత్తూరు అభివృద్ధి

- గత పాలకుల పాపం..నగరానికి శాపం
- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- సేవా కార్యక్రమాల నడుమ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు


ఆటో డ్రైవర్లకు కానుకలు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: 'చిత్తూరు నగరం జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ గత టీడీపీ పాలనలో రాజకీయ కారణాలతో అభివృద్ధికి నోచుకోలేదు.. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో రూపురేఖలు మారుతున్నాయి' అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను విజయానందరెడ్డి సేవా కార్యక్రమాల నడుమ నిర్వహించారు. దాదాపు వెయ్యికి పైగా ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు అన్నదానం చేసి, యూనిఫామ్ అందచేశారు. ఒక్కో డ్రైవర్‌కు రెండు జతల యూనిఫామ్, వాటిని కుట్టించుకో వడానికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి నగదును అందచేశారు. డ్రైవర్ల మధ్య కేక్ కట్‌చేసి మంత్రి పెద్దిరెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం విజయానందరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు మీదుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అంతరాష్ట్ర రోడ్డు సర్వీసులు అందుబాటులోకి రావడం వల్ల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, డొమెస్టిక్ ఎయిర్‌పోర్టులకు వెళ్లేందుకు మార్గం సుగమయ్యిందన్నారు. చిత్తూరులో పెద్ద ఎత్తున పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు స్థాపించడానికి అనుకూలమని.. పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు కూడా తక్కువగా ఉన్నాయని తెలిపారు. గంగాధరనెల్లూరులో త్వరలో ప్రారంభంకానున్న సాఫ్ట్‌వేర్ కంపెనీకి తాను ఉచితంగా భూములు ఇచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు శ్రీకాంత్, గణేష్, శశికుమార్, మధు, భాగ్యలక్ష్మి, ఇందుశ్రీ, సునీత, సహదేవన్, బాబు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్‌స్వామిరెడ్డి, గుడిపాల మండల నేతలు మధుసూదన్ రాయల్, హరిప్రసాద్ చౌదరి, నాయకులు కేపీ శ్రీధర్, అను, అల్తాఫ్ కౌసర్, అంజలీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కానుకల అందజేత


డ్రైవర్ల మధ్య మంత్రి పెద్దిరెడ్డి బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

పకడ్బందీగా ఈవీఎంల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్ (ఏటీపీ)ను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఈవీఎంల యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో రెండంచెల భద్రత నడుమ ఈవీఎంలను గొడౌన్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. 12 మంది బెల్ ఇంజినీర్ల సమక్షంలో ఈ నెల 16వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలన నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాకు కొత్తగా బెల్ కంపెనీ నుంచి 2,510 బ్యాలెట్ యూనిట్‌లు, 4390 కంట్రోల్ యూనిట్‌లు, 3617 వీవీప్యాడ్స్‌లకు ఏటీపీని నిర్వహిస్తున్నా రని తెలిపారు. జిల్లాలో గతంలో ఉన్న పాత బ్యాలెట్ యూనిట్‌లు 2,353, కంట్రోల్ యూనిట్‌లు 1,448, వీవీ ప్యాడ్స్ 1,711 అలాగే ఉన్నట్లు తెలిపారు. ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ లకు సంబంధించి బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజినీర్ల పర్యవేక్షణలో అధికారులు కంట్రోల్ యూనిట్,బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్,ఓటింగ్ బటన్లు, ప్రింట్ స్లిప్‌లు తదితర అంశాలను నిశితంగా పరిశీస్తున్నట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీప్యాట్‌ల స్కానింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. పటిష్ట పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విజిటింగ్ రిజిస్టర్ నిబంధనలు పాటిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. డీఆర్‌వో రాజశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా, సిబ్బంది ఉమాపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అది పాము కళేబరం కాదు.. ప్లాస్టిక్

– ఐసీడీఎస్ పీడీ నాగశైలజ


ఎండు ఖర్జూజం ప్యాకెట్‌లో ప్లాస్టిక్ వస్తువు

బంగారుపాళెం: గర్భిణికి పంపిణీ చేసిన పౌష్టిక ఆహారంలోని ఎండు ఖర్జూజ ప్యాకెట్‌లో వచ్చింది పాము కళేబరం కాదని, అది ప్లాస్టిక్ అని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ స్పష్టం చేశారు. మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ శాంతినగర్ అంగన్ వాడీ కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టిక ఆహారంలో పాము కళేబరం అంటూ బుధవారం పచ్చ పత్రికల్లో, చానళ్లలో వార్తలు ప్రచురితమయ్యాయి. దాంతో ఐసీడీఎస్ పీడీ శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. పౌష్టికాహారం అందుకున్న గర్భిణి మానసను విచారించారు. ఈ నెల నాలుగో తేదీ పంపిణీ చేశారనీ, అందులో ఎండు ఖర్జూరం ప్యాకెట్‌ను మంగళవారం తెరిచినట్లు ఆమె తెలిపింది. అందులో పాము లాంటి వస్తువు ఉండడంతో ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త జానకి దృష్టికి తీసుకు వెళ్లినట్లు పేర్కొంది. తరువాత ఎండు ఖర్జూరం ప్యాకెట్‌లో పాము లాంటి వస్తువును చేతిలోకి తీసుకుని కళేబరమా లేక ఇతర వస్తువేదైనా అని పరిశీలించారు. దాని వాసన చూశారు. చేతిలో పట్టుకుని గట్టిగా విరిచారు. విరగక పోవడంతో పాము కళేబరం కాదని నిర్ధారించారు. పీడీ మాట్లాడుతూ పాము కళేబరం ఐతే తునిగి ముక్కలుగా విరిగిపోయేదన్నారు. ప్యాకింగ్ సమయంలో ప్లాస్టిక్ లాంటి వస్తువు ఎండు ఖర్జూజంతో ప్యాక్ అయిందని అనుమానం వ్యక్తం చేశారు. ప్యాకెట్‌లో ఉన్న వస్తువు గట్టిగా అంగుళం పైగా ఉందని, అక్కడక్కడ పచ్చచుక్కలు కలిగి ఉందని, ల్యాబ్‌కు పంపుతామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. పాము కళేబరం ప్యాకెట్‌లో ఉంటే వాసన వచ్చేదన్నారు. పచ్చపత్రికలు ప్రభుత్వంపై బురద జల్లె ప్రయత్నం చేయడం గర్హనీయమని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, పక్కన కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పరిష్కారంలో సమస్యలేమన్నా ఉన్నట్లైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కమిటీలో సభ్యులు వెల్లడించిన సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను నిష్పక్షపాతంగా పరిష్కరిస్తున్నామన్నారు. చట్టానికి లోబడి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని దళితవాడల్లో శ్మశాన వాటికల దారి సమస్యలు పరిష్కరించాలన్నారు. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లెకు దారి ఏర్పాటు చేయాలని కోరారు. డీఆర్‌వో రాజశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, ఆర్డీవోలు రేణుక, సుజన, శివయ్య, పలు సంఘాల నాయకులు దేవరాజులు, డేవిడ్, రాజ్‌కుమార్, మునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓలు

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పెనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డిప్రతాప్ ఎన్నికై నట్లు హెచ్‌ఎం వెంకటేశులునాయుడు తెలిపారు. బుధవారం పాఠశాలలో బాలుడిని ఎంఈఓలు రంగనాథరెడ్డి, భాస్కర్‌నాయుడు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మంగళవారం రామకుప్పం రెసిడెన్సియల్ పాఠశాలలో జరిగిన షూటింగ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో రెడ్డిప్రతాప్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈనెల 18,19 తేదీల్లో అన్నమయ్య జిల్లా కేవీపల్లెలో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొననున్నాడని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీలు చంద్రశేఖర్, చౌదరినాయుడును ఎంఈఓలు అభినందించారు.

సచివాలయ సేవలు భేష్


సిబ్బందితో మాట్లాడుతున్న శిరీష

కార్వేటినగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సచివాలయ సేవలు భేషుగ్గా ఉన్నాయని కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) అధికారి శిరీష తెలిపారు. ఆమె బుధవారం కార్వేటినగరం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయాల ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. గతంలో ప్రజలు ప్రభుత్వ అధికారులు, కార్యా లయాల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ప్రజల వద్దకే పాలన తీసుకురావడం గొప్ప విషయమన్నారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి చెత్త నుంచి ఎరువుల తయారీపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనుంజయవర్మ, ఈవోపీఎస్ మణి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోయలో పడిన బైక్

భార్యమృతి, భర్త, పిల్లలకు గాయాలు


లోయలో పడిన బైక్ (ఇన్‌సెట్) మృతి చెందిన బేబి (ఫైల్)

పలమనేరు: పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్ చెన్నై–బెంగళూరు హైవేలో బుధవారం ఓ బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న లోయలో పడింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్త, కుమార్తెకు గాయాలైయ్యాయి. బంగారుపాళెం మండలం జయంతి గ్రామానికి చెందిన మోహన్ భార్యాపిల్లలతో కలసి బైక్‌పై పలమనేరులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. వీరిబైక్ మొగిలి ఘాట్‌లో వస్తూ అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి పడ్డారు. ఈ ఘటనలో మోహన్ భార్య బేబి(28) తలకు బండరాయి తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మోహన్(30), కుమార్తె మాలతి(5) గాయపడ్డారు. ఒకటిన్నరేళ్ల కుమా రుడు మోహిత్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. కుమార్తె మాలతీని చిత్తూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారిస్తున్నారు.

వీకోటలో ఇంటి యజమాని హత్య

వీకోట : గొడవ చేస్తుండగా మందలించాడని ఇంటి యజమానిపై కత్తితో దాడి చేసి హత్య చేసిన సంఘటన వీకోట భారత్ నగర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భారత్‌నగర్‌కు చెందిన సాంబశివపిళ్లై ఇంట్లో కాంచనమ్మ అనే మహిళ అద్దెకు ఉంటోంది. కాంచనమ్మ సోదరుడు బసవరాజ్ నారాయణ నగర్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి కాంచనమ్మ ఇంటికి వచ్చి తలుపులను బాది గొడవకు దిగాడు. ఈ సందర్భంగా సాంబశివపిళ్లై ఎందుకు గొడవ పడుతున్నారని మందలించాడు. దీంతో బసవరాజ్ అకస్మాత్తుగా సాంబశివపిళ్లైపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర రక్తపు మడుగులో పడి ఉన్న అతన్ని స్థానికులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బసవరాజ్ హత్యానంతరం పోలీసులకు లొంగిపోయాడు. సీఐ లింగన్న కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ.. చిన్నారి మృతి


ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి దేవ

కార్వేటినగరం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీరంగరాజపురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన నవీన్(38), భార్య స్వప్న, రెండేళ్ల చిన్నారి దేవతో కలసి శ్రీరంగరాజపురం మండలంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొల్లాగుంట పాత చెక్‌పోస్టు సమీపంలోని జాతీయ రహదారిపై వస్తుండగా ద్విచక్రవాహనాన్ని పుత్తూరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో నవీన్, స్వప్న, చిన్నారి దేవ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి 108కు సమాచారమిచ్చారు. ఆ వాహన సిబ్బంది క్షతగాత్రులను పుత్తూరుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చిన్నారి దేవ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్: దసరా సెలవుల రద్దీని దృష్టిని ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడిపేపేందుకు ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ప్రధానంగా చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు 8 సర్వీసులు నడపనున్నారు. డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు వంటి ప్రాంతాలకు అదనంగా సర్వీసులు నడిపేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈబస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయమని తెలిపారు. ఇతర పట్టణ ,గ్రామీణ ప్రాంతాలకు కూడా బస్సుల కొరత లేకుండా నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థకు లాభం చేకూర్చడంతోపాటు గమ్యాలకు సురక్షితంగా చేరాలని కోరారు.

ఈ-శ్రమ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: అసంఘటిత రంగ కార్మికులు ఈ–శ్రమ్ కార్డు పొందాలని జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ పొందని 16–59 వయస్సు ఉన్న కార్మికులు ఈకార్డును పొందేందుకు అర్హులన్నారు. చిత్తూరులోని పాత కలెక్టరేట్‌లో గల కార్మికశాఖ కార్యాలయంలో సందేహాల నివృత్తి కోసం 6302263078 నంబరుతో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్డు ఉంటే వలస కార్మికులు రేషన్ దుకాణంలో బియ్యం తీసుకోవచ్చని, ప్రమాద బీమా రూ.2 లక్షలు వస్తుందని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాలకు భూసేకరణ చేపట్టండి

చిత్తూరు కలెక్టరేట్ : ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించేందుకు భూసేకరణ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా స్థలాలు గుర్తించే ప్రక్రియ చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంతో పాటు అదనంగా దరఖాస్తులు చేసుకున్న 6 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో పలు మార్లు సమావేశాల్లో చర్చించినప్పటికీ తహసీల్దార్లు సరైన నివేదికలు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు.

డివిజన్ కేంద్రాల్లో మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు

జిల్లాలో దరఖాస్తు చేసుకున్న మాజీ సైనికులకు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరులో మార్కెట్ ధర ప్రకారం ఒక్కొక్కరికి నాలుగు సెంట్లు స్థలం కేటాయించాలన్నారు. సైనిక సంక్షేమశాఖ అధికారితో సమన్వయం చేసుకుని ప్రక్రియ నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూములు గుర్తించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డీఆర్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు రేణుక, సుజన, శివయ్య, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

- జల్సాల కోసం చోరీ వృత్తి
- రూ.12లక్షలు విలువజేసే 21 బైక్‌లు సీజ్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పలమనేరు: రోజుకో బైక్‌నైనా చోరీ చేస్తేగాని నిద్ర పట్టదు. ఈ బైక్‌లను కారుచౌకగా విక్రయించి ఆ పూటకు జల్సాలు చేయడం వృత్తిగా మార్చుకున్నాడు. కొన్నాళ్ళుగా పలమనేరులోనే 21 బైక్‌లను చోరీచేసిన ఈ దొంగను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, 21 బైక్‌లను రికవరీ చేశారు. వివరాలను పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి వెల్లడించారు. కొన్నాళ్లుగా పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో బైక్‌లు చోరీలు జరుగుతున్నాయి. రెండ్రోజుల కిందట గడ్డూరు కాలనీ వద్ద తన బైక్ పోయిందని నాగేంద్రబాబు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం స్థానిక బస్టాండు వద్ద ఓ యువకుడు బైక్‌పై వెళుతూ పోలీసులను చూసి పరారైయ్యేందుకు ప్రయత్నించగా, పోలీసులు పట్టుకున్నారు. విచారణలో అసలు విషయం బయటపడింది. పుంగనూరు పట్టణంలోని నక్కబండకు చెందిన మురుగన్ కుమారుడు సతీష్(19) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. సొంత ప్రాంతంలో కాకుండా రోజుమార్చిరోజు పలమనేరుకు రావడం రకరకాల బైక్ తాళాలతో దర్జాగా బైక్‌లను స్టార్ట్ చేసి చోరీ చేసేవాడు. ఈ బైక్‌లను రూ.2 వేలనుంచి రూ.5వేలకు అమ్మి ఆ పూటకు జల్సాలు చేసేవాడు. పలమనేరు మండలం పందేరుపల్లి వడ్డూరుకు చెందిన జయప్రకాష్‌కు ఏడు, పుంగనూరుకు చెందిన ఆరీఫ్, నవాజ్‌కు పది, వీకోట మండలం ఎగువ నడిపేపల్లెకు చెందిన సద్దాం, షేక్ అమ్రుల్లాకు మూడు బైక్‌లు అమ్మినట్టి విచారణలో తెలిపాడు. దొంగసొత్తును కొన్నందుకు వీరిపై కూడా కేసు నమోదు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. చాలెంజ్‌గా తీసుకొని నిందితుడిని పట్టుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్‌లు సుబ్బారెడ్డి, సహదేవీని డీఎస్పీ అభినందించారు. క్రైమ్‌పార్టీ సిబ్బంది ఏఎస్‌ఐ దేవరాజులు, ఏఎస్‌ఐ శ్రీనివాసులు, పీసీలు అల్లా ఉద్దీన్, ప్రకాష్, అశోక్, శీనప్ప, నరేష్‌కు క్యాష్ రివార్డులను అందజేశారు.